క్లుప్తంగా

పోలింగ్ కేంద్రమంటే ?

కరీంనగర్ అర్బన్: అభ్యర్థుల భవిష్యత్‌ను నిర్ణయించే అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలు సమకూర్చిన అధికారులు గురువారం పోలింగ్ నిర్వహించేందుకు సర్వం సిద్ధంచేశారు. ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అసలు పోలింగ్ కేంద్రంలో ఎంతమంది ఉంటారు? వారు ఏం చేస్తారు? మనకు సందేహం వస్తే ఎవరిని అడగాలి.? ఓటింగ్ యంత్రాలు ఎక్కడ ఉంటాయి.. తదితర అంశాలపై కథనం.

పోలింగ్ కేంద్రం
పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితో పాటు సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు ఎన్నికల అధికారులు విధులను నిర్వహిస్తారు.

ఈవీఎం పరికరాలు ఇలా..
ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈవీఎంలో మూడు పరికరాలు ఉంటాయి. అవి కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్. కంట్రోల్ యూనిట్ పోలింగ్ అధికారి (మూడో అధికారి) వద్ద ఉంటుంది. బ్యాలెట్ యూనిట్ అంటే ఓటరు మీట నొక్కే విభాగం. దీంతోనే ఓటు హక్కు వినియోగించుకుంటారు. వీవీ ప్యాట్‌ను బ్యాలెట్ యూనిట్‌కు ఎడమ వైపుగా ఏర్పాటు చేస్తారు. మీట నొక్కిన తర్వాత వీవీప్యాట్ సరిచూసుకునేందుకు వీలు కల్పిస్తూ ఏడు సెకన్ల పాటు నిలిచి ఉంటుంది. తర్వాత అది కట్ కావడంతో ఎంపిక చేసిన బాక్స్‌లో పడుతుంది.

ప్రిసైడింగ్ అధికారి
పోలింగ్ కేంద్రంలో అన్ని వ్యవహారాలకు పూర్తి బాధ్యత ప్రిసైడింగ్ అధికారిదే. ఈయన నియోజకవర్గ కేంద్రం నుంచి ఎన్నికల సామగ్రితో ప్రత్యేక వాహనాల్లో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి చేరవేస్తారు. ఓటింగ్ పూర్తయ్యాక అప్పగిస్తారు. పోలింగ్ కేంద్రంలో పర్యవేక్షిస్తారు.

సహాయ ప్రిసైడింగ్ అధికారి
ఓటరు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లగానే మొదట సహాయ ప్రిసైడింగ్ అధికారి ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు), ఓటరు స్లిప్‌ను పరిశీలించి ఓటరు జాబితా (మార్కింగ్ కాపీ)లో నమోదు చేసుకుంటారు. పోలింగ్ కేంద్రంలో ఉన్న ఆయాపార్టీల ఏజెంట్లకు వినిపించేలా ఓటరు పేరు వివరాలను చదువుతారు. వెల్లడించిన వివరాలను పోలింగ్ కేంద్రంలోని ఆయాపార్టీల ఏజెంట్లు నమోదు చేసుకుంటారు.

మూడో అధికారి
ఇతడు ఓటరుకు సిరా గుర్తు పెట్టి అనంతరం ఓటరు రిజిస్టర్‌గా వ్యవహరించే ఫాం 17ఏలో వివరాలు నమోదు చేసుకుంటారు. ఓటరు సంతకం తీసుకొని ఓటరు స్లిప్‌ను అందిస్తారు.

నాలుగో పోలింగ్ అధికారి
సిరా మార్క్‌ను రూఢీ చేసి ఓటరు స్లిప్ తీసుకొని, కంట్రోల్ యూనిట్‌లో బ్యాలెట్‌ను జారీచేస్తారు. అప్పుడు బిజిలైట్‌తో పాటు ఈవీఎంపై పచ్చ(గ్రీన్) లైట్ వెలుగుతుంది. అనంతరం ఓటరు తాను ఎంచుకున్న అభ్యర్థి గుర్తుకు ఎదురుగా ఉన్న మీటా నొక్కాలి. పక్కనే ఎడమ వైపు ఏర్పాటు చేసిన వీవీప్యాట్‌లో 7 సెకన్ల పాటు తాను వేసిన ఓటును నిర్ధారించుకునే అవకాశం వినియోగింకోవాలి. అనంతరం పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లొచ్చు.

ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరి
ఓటర్లు పక్కన కింద పేర్కొన్న వాటిలో ఏదో ఒక గుర్తింపు కార్డు తీసుకెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవచ్చని ఎన్నికల సంఘం తెలిపింది.
ఓటరు చీటీ, ఆధార్ కార్డు. పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు , ఉపాధి కూలీ కార్డు (జాబ్‌కార్డు), కార్మికుల ఆరోగ్య కార్డు, - పింఛను ధ్రువీకరణ పత్రం, ఉద్యోగి ఫొటో గుర్తింపు కార్డు (ప్రభుత్వ, ప్రైవేటు, - బ్యాంకు పాసుపుస్తకం

మద్యం దుకాణాల పరిశీలన

శంకరపట్నం: మండలంలోని మద్యం దుకాణాలకు వేసిన సీల్లను బుధవారం ఎక్సైజ్ సీఐ దుర్గాభవాని పరిశీలించారు. గురువారం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మద్యం దుకాణాలను సీజ్ చేశారు. మద్యం విక్రయించకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పంటపొలాల్లో ఫ్లైఓవర్ నిర్మాణం


కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణం


కొనసాగుతున్న నిర్మాణ పనులు

- పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది
- భూములు కోల్పోయి నష్టపోతున్న రైతులు
- పరిహారం పెంచాలని విజ్ఞప్తి

శంకరపట్నం: మండలంలోని అంబాల్‌పూర్‌పూర్ గ్రామంలో పంటపొలాల్లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతోంది. కరీంనగర్ నుంచి వరంగల్ వరకు ఫోర్‌లైన్ జాతీయ రహదారి పనులు సైతం జరుగుతున్నాయి. ఈ పనుల కోసం రైతుల పంట పొలాలను రెవెన్యూ శాఖ సేకరించింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న రోడ్డు పనులు చకచకా సాగుతున్నాయి. రైతులకు ఎకరానికి సుమారు రూ.8లక్షల మాత్రమే అందడంతో వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండలంలోని తాడికల్, అంబాల్‌పూర్, కేశవపట్నం బైపాస్ రోడ్డు పనులు జరుగుతుండగా మొలంగూర్ క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకుంది. అంబాల్‌పూర్ గ్రామంలో బైపాస్‌రోడ్డు నిర్మాణం, తాడికల్, అంబాల్‌పూర్ గ్రామాల మధ్య ఫ్లై ఓవర్ నిర్మాణం చేపడుతున్నారు. జాతీయ రహదారి, ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులు రవాణా మార్గానికి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఇబ్బంది పడుతున్నాం


అంబాల్‌పూర్ గ్రామంలో ఫ్లై ఓవర్ పనులు జరుగుతున్న ప్రాంతంలో వ్యవసాయ భూములకు వెళ్లేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇబ్బంది లేకుండా అధికారులు రోడ్డునిర్మాణం చేపట్టాలి. పరిహారం తక్కువ మోతాదులో రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పరిహారం పెంచి అదనంగా డబ్బులు అందించాలి.
– దొమ్మేటి రాజిరెడ్డి, మాజీ సర్పంచ్, అంబాల్‌పూర్

భూములు కోల్పోయాం


నాకు గ్రామంలో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఎకరా ఆరు గుంటలు బైపాస్ నిర్మాణానికి సేకరించారు. మధ్యలో బైపాస్ రోడ్డు వేయడంతో రెండు వైపులా భూమి మిగిలింది. ఈ భూమిని సాగు చేద్దామంటే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. పంట పొలంలోకి వెళ్లాలంటే ఇక్కట్లు పడుతున్నాం.
– బుర్ర శ్రీనివాస్, రైతు

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం


జమ్మికుంట: పట్టణంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ గణపతి హోమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మండలపూజ మహోత్సవం సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీ లక్ష్మీ గణపతి హోమం నిర్వహించి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దీక్ష తీసుకున్న స్వాములకు 41 రోజులు భిక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి సేవాసమితి గురుస్వాములు ప్రతాప్‌రెడ్డి, మా మిడాల మనోహర్, జగదీశ్వర్, ఎల్లారెడ్డి, వెంకట్‌రె డ్డి, మారుతి, స్వాములు, తదితరులు పాల్గొన్నారు.



ఓటుహక్కును వినియోగించుకోవాలి

చొప్పదండి: పోలింగ్ సజావుగా సాగేందుకు పట్టణంలోని పోలింగ్ కేంద్రాలల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ తెలిపారు. ఓటర్లకు తాగునీరు, వికలాంగులకు వీల్ చైర్లు, మరుగుదొడ్లు, ఫ్యాన్‌లు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అత్యవసర వైద్యసేవలకు అంబులెన్స్‌లు కూడా సిద్ధంగా ఉంచామన్నారు. ఓటర్లు ఓటుహక్కును తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పది పోలింగ్ కేంద్రాలు, బాలికల ఉన్నత పాఠశాలలో 7 పోలింగ్ కేంద్రాలు, గాంధీనగర్ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రమాదపుటంచున ప్రయాణం


గునుకులకొండాపూర్- జంగపల్లి మధ్య రోడ్డు పక్కన ప్రమాదకరంగా బావి

- రహదారుల పక్కనే ప్రమాదకరంగా బావులు
- సైడ్‌వాల్స్ లేక ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

గన్నేరువరం: రోడ్డుపక్కన గల బావులకు సైడ్‌వాల్స్ లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇరువైపులా గుబురుగా పెరిగిన చెట్ల మొక్కలతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడని పరిస్థితి నెలకొంది. గతేడాది గునుకుల కొండాపూర్ గ్రామ శివారు చొక్కాలపల్లెలో రహదారి పక్కన బావిలోకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో పలువురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. మండలంలోని పలు గ్రామాల్లోకి వెళ్లే రహదారుల పక్కనే బావులు ఉన్నాయి. మండలంలోని మైలారం -హన్మాజిపల్లె గ్రామాల రోడ్డు పక్కనే బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రహదారి గుండానే హన్మాజిపల్లె, గోపాల్‌పూర్ గ్రామాల ప్రజలు మండలకేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. గునుకుల కొండాపూర్ వయా పీచుపల్లి నుంచి వడ్లూరు గ్రామానికి వెళ్లే రహదారిలో మూడు బావులు ఉన్నాయి. గుండ్లపల్లి నుంచి జంగపల్లి గ్రామాల మధ్య రహదారి పక్కనే నాలుగు బావుల ప్రమాదకరంగా ఉన్నాయి. ఖాసీంపేట్, గన్నేరువరం, మైలారం గ్రామాలకు వెళ్లే రహదారి పక్కనే సైతం చాలావరకు బావులు ఇలాగే దర్శనమిస్తున్నాయి. సైడ్‌వాల్స్ నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ రహదారులపై వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు గుండ్లపల్లిలోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు వెళ్తుంటారు. రహదారుల వెంబడి ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావుల పక్కన సైడ్‌వాల్స్ నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. అధికారులు కనీసం సూచికల బోర్డులు కూడా ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారుల మూలమలుపు వద్ద చెట్లు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాల కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఆయాగ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న మూ లమలుపుల వద్ద సంబంధిత అధికారులు దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఊరు పిలుస్తోంది.. ఓటు తలుస్తోంది

- సమగ్ర కుటుంబ సర్వేలా మరిపించమంటోంది
- శతశాతం ఓటింగ్‌తోనే ప్రజాస్వామ్యం
- నచ్చకుంటే 'నోటా' ఉందిగా..

కరీంనగర్ అర్బన్: పండగొచ్చిందంటే రెక్కలు కట్టుకుని సొంతూళ్లో వాలిపోతాం. నెల ముందుగానే పుట్టిన ఊరికి వెళ్లడానికి టికెట్లు బుక్ చేసుకుంటాం. అనేక వేడుకలు, శుభకార్యాలకు గ్రామానికి వస్తాం. బంధువులను పలకరించి, అయినవాళ్లతో హాయిగా గడిపి మళ్లీ వెళ్లిపోతాం. మరీ రేపే జన్మస్థలంలో గొప్ప కార్యం జరగబోతోంది. దానికి అందరూ తప్పకుండా రావాలని ఊరు పిలుస్తోంది. ఓటు తలుస్తోంది. అదే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వజ్రాయుధం. మిగతా సంబురాల్లాగానే దీనికి తప్పకుండా వచ్చి ఓటేసి సొంత గడ్డపై ఒక రోజు హాయిగా సేదదీరి వెళ్లాలని కోరుతోంది. ఓటేసి పొమ్మంటోంది.

హైదరాబాద్‌తో పాటు పలు రాష్ట్రాల్లో ఓటర్లు
జిల్లాకు చెందిన చాలా మంది విద్యా,వ్యాపారం, ఉపాధి రీత్యా దేశంలోని నలుమూలలా ఉంటున్నారు. ఉద్యోగులు బదిలీలపై పొరుగు జిల్లాలకు వెళ్లి నివసిస్తున్నారు. చేనేత కార్మికులు వేల సంఖ్యలో ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. ఇలా అనేక వర్గాల ప్రజలు వేరేచోట ఉన్నా.. ఓటు మాత్రం సొంతూళ్లోనే ఉంది. సాధారణ ఎన్నికల క్రమంలో సెలవు దినం. అయితే గురువారం పోలింగ్ కాగా శుక్రవారం మినహాయిస్తే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు శని, ఆదివారాలు సెలవు రోజులు కలిసి వస్తుండటంతో కుటుంబసభ్యులు, స్నేహితులను కలిసినట్లు ఉంటుందన్న భావన ఓటర్లలో వ్యక్తమవుతోంది. ఇతర రాష్ట్రాల్లోని వారు ఒక రోజు సెలవు పెట్టుకొని వస్తే ఓటేయొచ్చు. స్నేహితులు, కుటుంబ సభ్యులను చూడొచ్చు. పలకరించొచ్చు.


సమగ్ర కుటుంబ సర్వే యాది చేసుకోండి

రాష్ట్రం ఏర్పడ్డ కొత్తలో ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టింది. అప్పుడు బయట ఉండేవారంతా రెక్కలు కట్టుకుని వచ్చి వాలారు. అలాగే ఓటు వేడుకకు తరలొచ్చి నచ్చిన నాయకుడికి ఓటేసి వెళ్తే ప్రజాస్వామ్య యజ్ఞంలో పాలుపంచుకున్న తృప్తి ఉంటుంది. నాకెందుకులే.. అనుకోవద్దు. నీ ఒక్క ఓటే గెలుపోటములను నిర్ణయించవచ్చు.

ప్రలోభాలకు లొంగొద్దు
ప్రస్తుతం పలు రాజకీయ పార్టీలు ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లపై దృష్టి పెట్టాయి. ఓటింగ్ శాతాన్ని పెంచుకోవడానికి బూత్ కమిటీలతో ఆరా తీసి ఇప్పటికే ఫోన్లు చేశారు. దారి ఖర్చులతో పాటు ఇతర ఖర్చులను భరిస్తామని ప్రలోభపెడుతున్నారని సమాచారం. పోలింగ్ తేదీన రప్పించడానికి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఇలాంటి వాటికి దూరంగా ఉండండి. ఎవరి మాటలూ నమ్మకుండా స్వేచ్ఛగా ఓటు వేయండి.


గత ఎన్నికల్లో 77.93శాతం
జిల్లామొత్తంగా 2018 సాధారణ ఎన్నికల్లో 77.93శాతం ఓటింగ్ నమోదైంది. కరీంనగర్‌లో అత్యల్పంగా 68శాతమే కాగా మానకొండూరులో 85.29శాతం, హుజూరాబాద్ 83.72శాతం, చొప్పదండిలో 78.63శాతం పోలింగ్ నమోదైంది. 90శాతం ఓటింగ్ జరిగితే గొప్పగా చెప్పుకునే పరిస్థితి. అందుకే దీన్ని హక్కుగా చూడకుండా బాధ్యతగా తీసుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది. ఓటు వేయడం తప్పనిసరి చేయాలన్న డిమాండ్ కూడా ప్రజాస్వామ్యవాదుల నుంచి బలంగా వినిపిస్తోంది.

ఎవరెవరు ఎక్కడెక్కడ?
విద్యార్థులు: ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, కర్నాటక, పంజాబ్
సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు : బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, తిరువనంతపురం, ముంబయి, ఢిల్లీ.
చేనేతలు: సూరత్, భీవండి, అహ్మదాబాద్, ముంబయి.
ఉద్యోగులు: కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్, విశాఖపట్నం, వరంగల్, తిరుపతి.
వ్యాపారులు: హైదరాబాద్ తోపాటు అనేక జిల్లాలు, ఇతర రాష్ట్రాలు.
కార్మికులు: ముంబయి, హైదరాబాద్.

జిల్లా మొత్తం ఓటర్లు:	10,59,215
సర్వీసు ఓటర్లు:	587
ఎన్నారై ఓటర్లు:	122
ఇతరులు:	58

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలింగ్‌కేంద్రాలు
కరీంనగర్	3,55,054	390
చొప్పదండి	2,32,990	327
మానకొండూరు	2,21,613	316
హుజూరాబాద్	2,49,558	305

శ్మశానవాటిక అంతా పిచ్చిమొక్కలు


మానకొండూర్ : మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో శ్మశానవాటిక పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దహన సంస్కార సమయంలో నీటిసౌకర్యం లేకపోవడంతో బోరు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఇందులో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వసతులు కల్పించాలని కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత


అధికారులకు సూచనలిస్తున్న ఎస్సై ప్రమోద్ రెడ్డి

తిమ్మాపూర్: మండలంలో అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు అధికారులు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీస్ భద్రతను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సమయంలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఇద్దరు పోలీసులను ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు సిబ్బంది పర్యవేక్షిస్తారని ఎస్సై ప్రమోద్ రెడ్డి పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి నియోజవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. ఒకరోజు ముందుగానే సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. పోలింగ్‌బూత్‌ల్లో అన్ని సౌకర్యాలు కల్పించారు.
– సాక్షి నెట్‌వర్క్


పోలింగ్ కేంద్రానికి తరలుతున్న సిబ్బంది


జమ్మికుంట : పోలింగ్ కేంద్రంలో సిబ్బంది


గన్నేరువరంలో మహిళా మోడల్ పోలింగ్ కేంద్రం


గంగాధర : పూలతో అలంకరించిన పోలింగ్ కేంద్రం